క్లుప్తంగా

అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పణ

గౌలిపురా: గౌలిపురాలోని బొడ్రాయి ఆలయ కమాన్ నిర్మాణం పనులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉదయం బొడ్రాయి ఆలయం నుంచి గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ఆలయ కమిటీ ప్రతినిధులు పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం బొడ్రాయి వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విశాల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పోలీసు అధికారులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వైడి.విశాల్(27) ఇటీవల జిమ్‌లో వ్యాయమం చేస్తూ గుండెపోటుతో మృతిచెందాడు. అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆసిఫ్‌నగర్ పోలీసులు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అందజేసిన వారిలో జాయింట్ కమిషనర్ గజారావ్ భూపాల్, ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్, మహంకాళి ఏసీపీలతో పాటు ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

అఫ్జల్‌గంజ్: పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పీఎల్ పద్మజా కుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిశంకర్, డాక్టర్ విజయ్‌భాస్కర్, శివశంకర్, అశోక్‌బాబు, సుచరిత, కౌసర్ ఫాతిమా, బబిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లబ్బైక్ యా అబ్బాస్ ర్యాలీ



డబీర్‌పురా: యా సఖ్హా-ఇ-హరమ్ జయంతి వేడుకలను పురస్కరించుకొని శనివారం లబ్బైక్ యా అబ్బాస్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ యాకుత్‌పురా షేక్ ఫయాజ్ కమాన్ నుంచి చాదర్‌ఘాట్ మసీదు, దారుషిఫా, డబీర్‌పురా, కోమటివాడి, నూర్‌ఖాన్‌బజార్, మదీనా మీదుగా గోల్కొండ ఖిల్లా వరకు కొనసాగింది.

కాంగ్రెస్ ప్లీనరీలో గోషామహల్ నాయకులు



ప్లీనరీలో మెట్టు సాయికుమార్ తదితరులు

అబిడ్స్: కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ఫిషర్ మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ అనుచరులతో కలిసి పాల్గొన్నారు. రాయ్‌పూర్‌లో జరుగుతున్న జాతీయ కాంగ్రెస్ ప్లీనరీలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. గోషామహల్‌తో పాటు తెలంగాణ నలుమూలలా కాంగ్రెస్ పార్టీ తిరిగి విజయ ఢంకా మోగిస్తుందన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మహమ్మద్ బిలాల్‌ను సన్మానిస్తున్న అలీ మస్కతీ

చార్మినార్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని మస్కతీ డైరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఇబ్రహీం బిన్ అలీ మస్కతీ అన్నారు. ఇటీవల జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పాతబస్తీకి చెందిన క్రీడాకారుడు మహమ్మద్ బిలాల్ 48-51 విభాగంలో పాల్గొని సత్తాచాటి సిల్వర్ మెడల్ సాధించడం పట్ల శనివారం అలీ మస్కతీ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరడంతో పాటు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి క్రీడలు ఎంతో తోడ్పడుతాయన్నారు.

వజ్రాభరణాలతో ఉడాయించిన కేటుగాడు చిక్కాడు

రూ.7 కోట్ల విలువైన సొత్తు రికవరీ

- విలేకరుల సమావేశంలో డీసీపీ జోయెల్ డేవిస్



వజ్రాభరణాలను మీడియాకు చూపుతున్న డీసీపీ జోయెల్ డేవిస్

నాంపల్లి: విలాసవంతమైన జీవితాన్ని పొందాలని ఆశించి రూ.7 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాభరణాలతో పారిపోయిన ఓ కేటుగాడిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.7 కోట్ల విలువైన బంగారు వజ్రాభరణాలను రికవరీ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఏసీగార్డ్స్‌లోని పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీసీపీ జోయెల్ డేవిస్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన వెలిశెట్టి శ్రీనివాస్ (33) రెండు నెలల క్రితం గచ్చిబౌలిలోని రాధిక డైమండ్స్‌లో డ్రైవర్‌గా విధుల్లో చేరారు. ఈనెల 17న రాధిక డైమండ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అక్షయ్‌కుమార్ బంగారు చెవి పోగులను ఓ వినియోగదారుడికి చూపెట్టడానికి కారులో మధురానగర్‌కు వెళ్లారు. బంగారు చెవి పోగులను తీసుకుని అక్షయ్ కుమార్ వినియోగదారుడికి దగ్గరకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన డ్రైవర్ శ్రీనివాస్ కారులో ఉన్న మిగతా బంగారు వజ్రాభరణాలతో ఉడాయించారు. కారు వెనుక సీటులో ఉన్న మరో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పారిపోవడానికి ప్రయత్నించిన డ్రైవర్ శ్రీనివాస్‌ను నిలువరించే ప్రయత్నం చేయగా కత్తితో బెదిరించి కారుతో పారిపోయారు. వజ్రాభరణాలు కలిగిన కారును నేరుగా బాలానగర్‌కు తీసుకెళ్లి అక్కడ తన బైక్‌లోకి వజ్రాభరణాలను మార్చుకుని అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో సేల్స్ ఎగ్జిక్యూటివ్ అక్షయ్‌కుమార్ ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలతో ఆరు ప్రత్యేక బృందాలతో జల్లెడపట్టారు. వజ్రాభరణాలతో ఉడాయించిన వ్యక్తిని పట్టుకునేందుకు సుమారు 150 సీసీ కెమెరాలలో తనిఖీ చేశారు. తన సొంత బైక్‌పై తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ ఉన్నట్లుగా పోలీసులు నిర్ధారించారు. దోచుకున్న సొమ్మును కొనుగోలుదారుడికి అప్పగించేందుకు డ్రైవర్ శ్రీనివాస్ హైదరాబాదుకు చేరుకున్నారు. బంగారు వజ్రాభరణాలను కొనుగోలుదారుడికి ఇస్తుండగా పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్నారు. వీటిలో 82 రకాల బంగారు వజ్రాభరణాలు ఉన్నాయని, ఈ సొత్తు విలువ రూ.7 కోట్లు ఉంటుందని డీసీపీ జోయెల్ డేవిస్ తెలిపారు. నిందితుడు మునుపెన్నడూ నేరాలు చేయలేదని, దోచుకెళ్లిన సొమ్ముతో విలాసవంతమైన జీవితాన్ని పొందాలని నేరానికి పాల్పడి ఉంటాడని తెలిపారు. ఈ మేరకు అతడి వద్ద నుంచి రూ.7 కోట్ల విలువైన వజ్రాభరణాలను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్దిఖీ, ఏసీపీ మోహన్ కుమార్, ఎస్‌ఆర్‌నగర్ సీఐ సైదులు, డీఐ రామ్ ప్రసాద్, ఎస్సైలు శ్రీకాంత్ గౌడ్, సర్దార్ జమాల్ పాల్గొన్నారు.

మజ్లిస్ ప్రజల పార్టీ: ఎమ్మెల్యే కౌసర్



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ అంటే ప్రజల పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఉదయం టోలిచౌకి వద్ద ఆయన మజ్లిస్ కార్పొరేటర్, నాయకులతో కలిసి ముంబైలో జరగనున్న పార్టీ జాతీయ సమావేశానికి బయలుదేరి వెళ్లాడు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి బెస్టాఫ్‌లక్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ రానున్న కాలంలో మరింత బలియమైన రాజకీయ శక్తిగా తయారవడం ఖాయమన్నారు. ప్రస్తుతం మహారాష్ట్రతో పాటు ఉత్తరాది రాష్ట్రాలలో సైతం మజ్లిస్‌కు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మజ్లిస్ పార్టీ ఎదుగుదలను, పార్టీ అధ్యక్షుడు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రజాదరణను చూసి ఓర్వలేని వారు రాజధాని ఢిల్లీలో ఆయన ఇంటిపై దాడి చేశారని ఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఖాదర్‌బాగ్ మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షుడు షబ్బీర్‌ఖాన్, జహంగీర్, యూసుఫ్, మొయిన్ భాయ్ తదితరులున్నారు.

ఈశ్వరీబాయి సేవలు మరువలేనివి



చార్మినార్: కేవలం దళితుల సంక్షేమమే కాకుండా మహిళాభివృద్ధి దివంగత మాజీ ఎమ్మెల్యే, ఈశ్వరీబాయి చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ శివకుమార్ కొనియాడారు. ఆమె 32వ వర్ధంతిని పురస్కరించుకొని ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర్ రాంచంద్రారెడ్డితో కలిసి ఆయన ఈశ్వరీబాయి కాంస్య విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

తెలంగాణ చరిత్ర గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: చరిత్రతో జానపదానికి, నిరక్ష్యరాస్యునికి విడదీయరాని అనుబంధం ఉందని, అది భావితరాలకు నాందిగా నిలుస్తుందని తెలుగు విశ్వవిదాయలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు అన్నారు. శనివారం తెలుగు వర్సిటీ సమావేశ మందిరంలో డాక్టర్ పేరాల సుధాకర్‌రావు రచించిన తెలంగాణ చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం కిషన్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ చారిత్రక నేపథ్యాన్ని అనేక కోణాల్లో అద్భుతంగా ఈ గ్రంథంలో రచయిత ఆవిష్కరించారన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ప్రముఖ చరిత్రకారులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ మాట్లాడుతూ... తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో ఆంధ్రుల చరిత్ర గ్రంథాలను 18 సంపుటాలుగా వెలువరించామని గుర్తు చేశారు. గ్రంథకర్త డాక్టర్ పేరాల సుధాకర్‌రావు విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య టి.తిరుపతిరావు పాల్గొనగా, ఆచార్య వెంకట్రామయ్య సమన్వయకర్తగా వ్యవహరించారు.

‘తెలంగాణ ప్రభుత్వం అప్పులపాలు’



జియాగూడ: ప్రధాని మోదీ దేశాన్ని ఆర్థికంగా పటిష్టం చేస్తే కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ‘ప్రజాగోస బీజేపీ భరోసా’ కార్యక్రమంలో భాగంగా జియాగూడలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని, ఆ పథకాలను పేదలకు నేరుగా అందించకుండా పేర్లను మార్చి తన పథకాలుగా కేసీఆర్ ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శక్తికేంద్ర ఇన్‌చార్జ్ కిషన్‌ధామా, బూత్ అధ్యక్షుడు మారుతి, రాహుల్, శివాజీ, డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ మునేందర్, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సిములు, శివయాదవ్, వెంకటేష్ యాదవ్, రాజ్‌పాల్, నరేష్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యునానీ ఆస్పత్రి దోహదం

చార్మినార్: ఆరోగ్య పరిరక్షణకు యునానీ ఆస్పత్రి దోహదపడుతుందని తెలంగాణ రాష్ట్ర యునానీ ఆయూష్ విభాగం కమిషనర్ ఎం.ప్రశాంతి ఐఏఎస్ అన్నారు. ప్రపంచ యునానీ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం పాతబస్తీ సాలార్ జంగ్ మ్యూజియం వెస్టన్ హాల్ సమావేశంలో ఆల్ ఆరీఫ్ యునానీ ఆస్పత్రి, రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ శరీరం ఎలా పరిపూర్ణంగా యునానీ కాన్సెప్ట్ ద్వారా ఎలా ఫామ్ అయిందని విషయం యునానీ వైద్యంలో చక్కగా వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యునానీ వైద్య విభాగం అభివృద్ధికి చేయూత అందిస్తుందన్నారు. అనంతరం ఆల్ ఆరీఫ్ యునానీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ తౌహిద్, డాక్టర్ నజీబ్‌లు మాట్లాడుతూ.. యునానీ వైద్యం ఫ్లెమ్ బ్లడ్ ఎల్లో బైల్ బ్లాక్‌బైల్ తదితర వాటిపై ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కం ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ వజీం ఉర్ రెహమాన్, ఆయూష్ విశ్రాంత డైరెక్టర్ మీర్ యూసుఫ్ అలీ, ఆస్పత్రి ట్రస్టీ అహ్మద్, సమీయుద్దీన్, మొయిన్, డాక్టర్ కలీం ఉల్లా ఖాన్, డాక్టర్ మొహసీన్‌తో పాటు యునానీ ఆస్పత్రి, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో ‘ఆయుష్మాన్ భారత్’

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని బీజేపీ సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లోని శ్రీకృష్ణభవన్ వద్ద ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యభీమా కార్డు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆయన బీజేపీ నాయకులు దేవర వంశీతో కలిసి ప్రారంభించారు. పేద బడుగు వర్గాల వారికోసం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యభీమా వరంలాంటిదని ఆయన అన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో పేర్లు నమోదు చేసుకుంటే సంవత్సరానికి రూ.5 ఆరోగ్యభీమా సౌకర్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నామా యాదగిరి, అశ్విన్, ప్రభు పూజారి, వెంకటేష్, సుధాకర్ తదితరులున్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీపీ కిరణ్ కరే

గోల్కొండ: పోలీసుల పాత్ర రోజురోజుకూ విస్తృతమవుతుందని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ కరే అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ కింగ్ క్లాసిక్ గార్డెన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో జాబ్ కనెక్ట్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేరాల నియంత్రణతో పాటు యువతకు ఉపాధి బాట చూపడంలో కూడా ముందుటున్నారని ఆయన అన్నారు. వివిధ కంపెనీల వారితో మాట్లాడి ప్రత్యేకంగా ఉన్నత చదువులు చదివి నిరుద్యోలుగా ఉన్న వారి కోసం అన్ని ప్రాంతాల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులంటే సమాజంలో నేడు ఎంతో గౌరవాభిమానాలు ఉన్నాయని, పోలీసుల పనితీరును మెచ్చుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. చిన్న ఉద్యోగంతోపాటు ఐటీ జాబ్‌లు, సాఫ్ట్‌వేర్ రంగంలో సైతం తాము ఇప్పటి వరకు వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి చూపించడం జరిగిందన్నారు. ఈ మెగా జాబ్ కనెక్ట్‌లో 25 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 200 పైగా విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ డివిజన్ ఏసీపీ శివమారుతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి

చాంద్రాయణగుట్ట: హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి ఓ వెల్డింగ్ కార్మికుడు మృతి చెందిన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నుమాలో ఇమ్రాన్ అనే వెల్డింగ్ దుకాణదారుడి వద్ద యూపీకి చెందిన బ్రిజేష్‌కుమార్ (35) వెల్డర్‌గా పని చేస్తున్నాడు. యజమాని సూచన మేరకు శనివారం సాయంత్రం అన్సారీ రోడ్డులో ఓ వస్త్రాల దుకాణానికి బోర్డును వెల్డింగ్ చేసేందుకు వెళ్లాడు. సమీపం నుంచే హైటెన్షన్ వైర్లు వెళుతున్నప్పటికీ.. నిర్లక్ష్యంగా వెల్డింగ్ చేస్తున్నాడు. ఫీట్ దూరం మాత్రమే ఉండడంతో ఒక్కసారిగా హైటెన్షన్ వైర్ల నుంచి అతనికి విద్యుత్ షాక్ తగిలి మంటలు వ్యాపించి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పిల్లలు యూపీలోనే ఉంటున్నారు. ఈ ఘటనకు యజమాని సూచనలు చేయకపోవడమే కారణమంటూ పోలీసులు ఇమ్రాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి



ప్రారంభోత్సవంలో బజరంగ్ దళ్ కార్యకర్తలు

నాంపల్లి: వీర హనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని బజరంగ్ దళ్ తెంగాణ రాష్ట్ర కన్వీనర్ శివరాములు సూచించారు. శనివారం కట్టెల మండిలోని శ్రీ కాశీ విశ్వనాథ్ ఆలయంలో ఏప్రిల్ 6న జరిగే శోభాయాత్రను పురస్కరించుకుని 41 రోజుల మాలాధారణ, కేంద్ర కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బజరంగ్ దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా వద్ద లక్ష గళ హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని తెలిపారు. లక్ష గళ హనుమాన్ చాలీసా పారాయణం విజయవంతం చేయడానికి ఇప్పటి నుంచి 41 రోజుల పాటు ప్రతి బస్తీలో బజరంగ్‌దళ్ కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని తెలిపారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి ముడుపు ఆదిరెడ్డి మాట్లాడుతూ..వీర హనుమాన్ శోభాయాత్రలో ప్రతి సంవత్సరం పాల్గొంటున్న యువత ఈ సంవత్సరం కూడా తమతో పాటు ఇంకో ఐదు మందిని తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. శోభాయాత్రలో పాల్గొనడం ప్రతి హిందువు తమ బాధ్యతగా స్వీకరించి ఏప్రిల్ 6న ఉదయం 9 గంటలకు గౌలిగూడ రామాలయం చేరుకోవాలని పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకులు కుమారస్వామి, వెంకటేష్, విజయ్, రమేష్, వెంకటేశ్వర రాజు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులను చేర్చుకోవాలి



మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రభాకర్ తదితరులు

సుల్తాన్‌బజార్: ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) ఏర్పాటులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులను చేర్చుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి రాష్ట్ర వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావును కోరారు. ఈ మేరకు శనివారం సంఘం ప్రతినిధి బృందం మంత్రి హరీష్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ సంఘం 1984లో స్థాపించామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లా శాఖలతో దాదాపు రెండు లక్ష మంది సభ్యత్వంతో తమ సంఘం నడుస్తుందన్నారు. తెలంగాణ అసెంబ్లీలో రిటైర్డ్ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ ట్రస్ట్‌ను ప్రభుత్వం ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ట్రస్టులో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలను విలువ చేర్చుతామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో తమ సంఘం ప్రతినిధులను చేర్చుకోవాలని మంత్రి హరీష్‌రావుకు విన్నవించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రెటరీ జనరల్ చంద్రప్రకాష్ రావు, కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షలు ప్రారంభం



జిన్సీ చౌరాహీలో దీక్షలు ప్రారంభిస్తున్న యమన్‌సింగ్, దినేష్‌సింగ్ తదితరులు

అబిడ్స్: హనుమాన్ 41 రోజుల మాల దీక్షలు ప్రారంభించారు. జిన్సీ చౌరాహీలోని సంతోషి మాత ఆలయంలో యమన్‌సింగ్, ధినేష్ సింగ్, గోవింద్‌రాజ్, అనిల్, సచిన్‌జోషి, మోహన్‌కృష్ణ ఈ దీక్షలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కఠోర దీక్షతో 41 రోజుల పాటు హనుమాన్ మాల ధరించడం వల్ల ఎంతో తృప్తి, మానసిక ఉల్లాసం, మానసిక శాంతి కలుగుతుందన్నారు.

బీసీలకు న్యాయం జరగాలి

అబిడ్స్: బీసీలకు న్యాయం జరగాలని నిర్వహించిన బీసీ ఫెడరేషన్ ధర్నాలో గోషామహల్ నియోజకవర్గం నాయకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్‌యాదవ్, వైస్ చైర్మన్ యోగేందర్, చైర్మన్ దుర్గారావులు పాల్గొన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని, ధర్నాచౌక్‌లో జరిగిన ధర్నాలో ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



ధర్నాలో నిర్మల్ కుమార్‌యాదవ్ తదితరులు

విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి



విద్యార్థులతో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో స్మార్ట్ జీనియస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకుముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ ఎం.మంజూర్ ఉస్సేన్, పాఠశాల చైర్మన్ రాజ్యలక్ష్మి రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.


పాండురంగారావు బహుముఖ ప్రజ్ఞాశాలి



కథక్ కళాక్షేత్రం డైరెక్టర్ పండిత్ అంజిబాబు, విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షుడు మాష్టార్‌జీ, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, రవళి రమేష్ బాబు పాల్గొన్నారు.

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కవి రాజశ్రీ పాండురంగారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో రవళి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నటరాజ రామకృష్ణ శతజయంతి ఉత్సవాల సందర్భంగా శాస్త్రీయ నృత్య సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ సంగీత కళలకు సముచిత ప్రాధాన్యతను కల్పిస్తుందని తెలిపారు. అనంతరం పాండురంగారావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.

‘అమ్మకు అక్షర నైవేద్యం’ పుస్తకం చరిత్రలో నిలిచిపోతుంది



పుస్తకాన్ని అందజేస్తున్న అరవింద్‌గౌడ్, వెంకటేష్

చాంద్రాయణగుట్ట: ‘అమ్మకు అక్షర నైవేద్యం’పుస్తకం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మహాకాళి మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరవింద్ కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ శనివారం దత్తాత్రేయను రాంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించి అమ్మకు అక్షర నైవేద్యం పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. తెలంగాణ చారిత్రక నేపథ్యం, బోనాల సంస్కృతి, లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని కీర్తిస్తూ దేశ విదేశాల్లో ఉన్న జగద్గురువులు, కవయిత్రులు, ఎందరో మహానుభావులు రాసిన దాదాపు 526 కవితలతో కూడిన పుస్తక సంకలనం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ మహా కార్యానికి కారకుడైన స్వర్గీయ గౌని మహేష్ గౌడ్ చిరస్మరణీయుడని ఆయన కొనియాడారు.

పేద ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్, చిత్రంలో ఆశీష్‌కుమార్ యాదవ్, ముఖేష్ సింగ్

అబిడ్స్: పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించడం ఎంతో గొప్ప వరం అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, హైదరాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. శనివారం గోషామహల్‌లోని గోడేకబర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆశీష్‌కుమార్ ఆయూష్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి తోడుగా పేద ప్రజల కోసం ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా ప్రతినెలా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తానని తెలిపారు. మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు శాంతిదేవి పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడిన విద్యార్థిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మా నాయక్

సంతోష్‌నగర్: వరంగల్ మెడికల్ కాలేజీ విద్యార్థి ప్రీతి బాయ్‌పై వేధింపులకు పాల్పడిన విద్యార్థిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మాట్లాడారు. వరంగల్ మెడికల్ కాలేజీ విద్యార్థి ప్రీతి బాయ్ ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి నాణ్యమైన వైద్యం అందించి నిందితుడైన సీనియర్ విద్యార్థిపై చట్టపరమైన చర్యలు తీసుకొని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు ఐక్యం చేసి బాధిత కుటుంబానికి ఆదుకునేంత వరకు పోరాటం ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మా నాయక్, జిల్లా కార్యదర్శి బాలు నాయక్, గిరిజన సంఘం సహా కార్యదర్శి ఆర్.శేఖర్ నాయక్, చందులాల్ వంతు నాయక్, మహిళా సంఘం అధ్యక్షులు ఎం.మీనా, సీఐటీయూ కార్యదర్శి శ్రావణ్ కుమార్, హోమ్ నాయక్ పాల్గొన్నారు.